ఇకమీదట నాకొరకు నీతికిరీటముంచబడియున్నది. 2 తిమోతి 4 : 7,8



### ప్రభువు పిలుపునందుకొన్న దైవజనులు

# పాష్టర్ జి.సి. సమూయేలు

(సెంట్‌పాల్ జి.డి.యం. సంఘకాపరి, అంతర్వేదిపాలెం) గారి

## క్లుప్త జీవిత చరిత్ర

పాష్టరు జి.సి. సమూయేలుగారు ఆది క్రైస్తవుడు శ్రీ గంటా అబ్రహాముగారి ద్వితీయ కుమారుడు. బాల్యంనుండి దైవసేవయందు ఆశక్తిచూపిస్తూ, యౌవ్వనంలోనే దేవుని సేవకు అంకితమైనారు. కేశవదాసుపాలెంలో ఆది క్రైస్తవులైన శ్రీ కొల్లాబత్తుల వీరాస్వామిగారి కనిష్ట కుమార్తె జానికమ్మగార్ని వివాహం చేసుకున్నారు. దేవుడు వీరి దాంపత్య జీవితాన్ని ఆశీర్వదించి కుమార్తె జననీ సుగంధం, కుమారులు విక్టర్‌బాబు, శ్యాంకుమార్‌లను అనుగ్రహిచారు. వీరు తాపీ మేస్త్రిగాను, బిల్డింగ్ ప్లాన్లువేయడంలో సిద్ధహస్తులు. లేబర్ ఫీల్డు సొసైటీకి సెక్రటరీగా పనిచేస్తూ, యౌవ్వనస్థుల కార్యక్రమాల్లో, రాత్రిపూటల్లో విరివిగా పాల్గొనేవారు. ప్రసిద్ధ తాపీమేస్త్రీగా మొదటి ఆలయం 1940 లో రూపకల్పన చేసారు. నాటి ఆర్ధిక ఇబ్బందుల్లో సేవకులకు ఆతిధ్యమిచ్చుటే మేలని సేవకులను ఆదరించుటలో వారి ఆప్యాయతను పంచుకున్న దంపతులు **సమూయేలు, జానికమ్మగార్లు.**

1942లో సంఘ కార్యదర్శిగా ఎన్నికై ఆలయ నిర్మాణంలో ప్రముఖ పాత్రవహించారు. ఆలయ పని, సేవాభారం పెరిగి పాష్టర్ కె.పి లాజరస్‌గారి పరిచర్యలో సహాయకాపరిగా పనిచేస్తూ సంఘపెద్దల పట్టుదలవల్ల సంపూర్ణ సువార్తికుని భాద్యత చేపట్టారు. సండేస్కూలు, యౌవ్వన సమాజం, స్త్రీల సమాజసేవ స్థాపించి సేవను విస్తరింపజేసి, రాత్రి కూటాలు, సువార్త దండయాత్రలు, తీర్థయాత్రలలో సువార్త చాటించుట, క్రైస్తవ పాటలు, బుర్రకథలు సంభాషణలు, నాటికలు వ్రాసి, వారితో కార్యక్రమాలు చేయించి యౌవనోత్తేజాన్ని విరాజిల్లచేసిన ధీరుడు. బర్మావారి ఆర్ధిక సహాయముతో సంఘములో క్రైస్తవ సమాజగ్రంధాలయాన్ని స్థాపించి యౌవ్వనస్థులకు సేవాదృక్పధమైన అభ్యాసానికి పునాదివేసారు. ఆ పునాదే ఈ నాటి సంఘనాయకులు, సమాజాలు, పునాదులు వేసుకొని ప్రాంతీయ సంఘాల్లో సేవకులుగా పనిచేస్తున్నారు. స్వార్ధం కొరకు కొందరు విశ్వాసం ద్వారా కట్టబడిన సంఘాన్ని గలిబిలిచేసి, విడగొట్టి, అనేక ప్రలోభాలు ఎరచూపి వారివైపు ఆకర్షించుకొని వేరే సంఘాలను స్థాపించుకోవాలని స్థానికసంఘాన్ని చిన్నాభిన్నం చేసే సమయంలో అప్పటికే బలిష్టమైన యౌవ్వనస్థులను వెంటబెట్టుకొని రాత్రింబగళ్ళు ప్రాంతీయ సంఘాలకు తిరిగి సంఘ సిద్ధాంతాలు బోధించి ప్రతీవారికి తెలియజేసి జి.డి.యం. సంఘాలను ఒకే త్రాటిపై నిలబెట్టిన ఆనాటి యౌవ్వన ధీరుడే ఈమేటి సువార్తయోధుడు. నేటి మన ప్రాంతీయ జి.డి.యం. సంఘాలు, స్థిరపడి, బలపడి నేటికి విస్తరించబడడానికి, ఆనాటి బలిమిగలవారి కబంధ హస్తాలనుండి మన విశ్వాసులను విడుదలచేసి ప్రాంతీయ జి.డి.యం. సంఘాలకు పునాదిరాయి పెకలింపబడే స్థితిలో అదే స్థానంలో నిలిపిన ధైర్యశీలి.

చదువులో ఓనామాలు మాత్రమే ఎరిగిన ఈ దైవజనుని హస్తంలో ముత్యాల్లాంటి దేవుని మాటలు, పలుకులు, పదాలు, గేయాలు, కథలు, రచనలు, ముత్యాల్లాంటి అక్షరశైలి ఏసేవకుని హస్తాల్లోనూ కానరావు. ఎండైనా, వానైనా, రాత్రైనా, పగలైనా,అర్ధరాత్రిసహా తన ఆయుధాలు, బైబిలు, కీర్తన పుస్తకం, వెలిగీవెగని లాంతరు, డ్రమ్ము, బూర నావెనుక ఎవరైనా వస్తున్నారా! అనే దినాలు కూడాఉన్నాయి. ఎన్ని మైళ్ళు అలా ప్రయాణంచేశారో తెలియదు. వీరి సేవాభారం జి.డి.యం. సంఘాల పరిష్టతకు దృఢసంకల్పుడైన వీరికి ఉభయ గోదావరి జిల్లాల తెలుగు కాన్ఫరెన్సు వైస్ ప్రెసిడెంటుగా, అంతర్వేదిపాలెం ప్రాంతీయ సెనెడ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శిగా, 65 సం॥రాలు సేవానుభవంలో మిషనరీలతో, సంఘాల నాయకులతో, సంఘకాపరులతో, వేలాదిమంది విశ్వాసులతో వారి చిరునవ్వుతో కూడిన ఆప్యాయతను పంచుకున్న ప్రేమామూర్తి. కాలినడక, సైకిల్ ప్రయాణమేతప్ప వీరికి వేరేవాహనం ఎక్కడ? 16 ముక్కలైన కుడికాలు మరలా పదిల పరచుకొని 1600 మంది విశ్వాసులకు సంఘకాపరిగా ఉన్నారు. అల్లుడు హోదాలోనున్న సహకాపరి డా॥ ఓ.యం. ప్రసాద్‌గార్ని ప్రథమ కుమారుని హోదా కల్పించుకున్న ఏకైక తండ్రి. కుమార్తె, అల్లుడు అనురాగంలో, ఆదరణలో చివరిక్షణం వరకు చంటి బిడ్డల హోదాలో పరము చేరిన ఘనత ఈ దైవజనుడు జి.సి. సమూయేలుగార్కి, జానికమ్మగార్లకే దక్కినదనుటకు అనుమానాలున్నాయా! ఏకోసానలేవు. వారితోపాటు ముగ్గురు బిడ్డలూ సేవలోను, అల్లుడిగార్ని సహకాపరిగాను పొందిన ఘనత వీరిదే అయివుండవచ్చు. మరలా 62 సం॥రాలలో నూతన ఆలయ పునాదిరాయివేసి సంవత్సరకాలంలో నూతన ఆలయాన్ని ప్రారంభించుకొని వారి సుధీర్ఘ సేవకు గుర్తుగా 2004 జనవరి 1న సంఘవిశ్వాసులతో సన్మానముపొంది, ఆత్మసిద్ధమే కాని శరీరం బలహీనం అనే బలహీనత సాకుగా పరములో బలవంతులు కావడానికి ప్రభుసన్నిధి కేగిన దైవజనుని అడుగుజాడల్లో, ఆత్మీయతతో ముందుకుపయనిద్దామా!

దైవజనుడు సన్నద్ధుడై నాటి సేవలో కుడిభుజాన బైబిలు సంచి, ఎడమభుజాన డ్రమ్ము, ఒకచేతిలో లైటు, మరొక చేతిలో బూర చేతపట్టి నాటి రోజుల్లో పాదరక్షలుసహా లేని సేవనందించిన దైవజనుడు. చివరి దశలో శరీరం శుష్కించినా, గంభీర స్వరం మూతపడుతున్నా మెల్లని స్వరంతో, ఆశీర్వదించిన చేతులు చచ్చుబడినా, ఆఖరి చిరునవ్వులతో దేవుడు మిమ్ము దీవించు గాకనే దీవెనలు అందించారు. తల్లితండ్రులకు రేయింబగళ్లు సేవచేసుకున్న కుమార్తె, కుమారులకు కృతజ్ఞత తెలియజేస్తూ, నేను ముగించిన సేవ మీరు కొనసాగించండంటూ ప్రస్తుత సేవకులు పాష్టరు కె.యం.జి. విజయంగారికి, డా॥ ఓ.యం. ప్రసాద్‌గారికి బాధ్యతలు అప్పగించి వారి కళ్ళ ఎదుటే తుది శ్వాస విడిచిన దైవజనులు **చినసమూయేలు.** గారు

ఇట్లు :

**అంతర్వేదిపాలెం**
12-5-2004

**కుటుంబ సభ్యులు** మరియు
**సెంట్‌పాల్ జి.డి.యం. సంఘ విశ్వాసులు, అంతర్వేదిపాలెం**